క్లుప్తంగా

జగన్‌ను కలిసిన కామిరెడ్డి



పెళ్లకూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి కలిశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కూడా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై మాజీ సీఎంకు వివరించారు. బీసీ సెల్ నియోజకవర్గ కార్యదర్శి ఎల్లు మోహన్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గుంజి దయాకృష్ణయాదవ్, గోగుతట్టు ఆనంద్, సుజిత్ పాల్గొన్నారు.

త్వరితగతిన జియో ట్యాగింగ్ సర్వే

చిల్లకూరు: జియో ట్యాగింగ్ సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని డీఎల్‌డీవో వాణి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆమె గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయాల డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యా రు. ఆమె మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఎంపీడీవో గోపి మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఎరువుల యాజమాన్యం పాటించాలి

గూడూరు రూరల్: రైతులు ఎరువుల యాజమాన్యం పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని గూడూరు ఏడీఏ బి.గోపీనాయక్ తెలిపారు. గూడూరు మండలంలోని పాలిచెర్ల, పాలిచెర్ల రాజుపాళెం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరిలో శాస్త్రీయంగా నారు పెంపకంపై అవగాహన కల్పించారు. యూరియాను ఎక్కువగా వాడితే కలిగే అనర్థాలను వివరించారు. పొటాష్ వాడకం వల్ల పంట నాణ్యత పెరుగుతుందని, జింక్ తప్పక వేసుకోవాలని సూచించారు. అనంతరం నిమ్మ తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టెక్నికల్ ఏవో చెంచురెడ్డి, ఏఈవో కె.శివ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆదేశించారు. ఆయన గురువారం నాయుడుపేట అర్బన్ పోలీసు స్టేషన్‌లో సీఐలు బాబి, సంగమేశ్వరరావుతో నేరాల నియంత్రణపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నాయుడుపేటలో ఎక్కువ మంది రోడ్లను ఆక్రమించుకోవడంతో ట్రాఫిక్ స్తంభిస్తోందన్నారు. వారికి మొదటి సారి హెచ్చరికలు చేయాలని, ఆక్రమణలు తొలగించకుంటే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

అందరి సహకారంతోనే అటానమస్

సూళ్లూరుపేట : ప్రముఖులు, అధ్యాపకుల సహకారంతోనే సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా లభించిందని ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర శర్మ తెలిపారు. కళాశాలలోని కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాజీ లైబ్రేరియన్ ఎస్ ప్రభాకర్ పేరు మీద ప్రతిభా పురస్కారాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, అధ్యాపకులు సీహెచ్ సుబ్రమణ్యంశాస్త్రి, ఆర్ శరత్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం నవజీవన్ ఆర్గనైజేషన్, సీసీపీయూ ప్రాజెక్టు సంయుక్తంగా ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ప్రాజెక్టు మేనేజర్ పి బాలాజీ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ బాధితులను సులకనగా చూడరాదన్నారు. అదేవిధంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాగణంలో హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురుకి రక్తపరీక్షలు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు వాణి, ఉపాధ్యాయులు నిర్మల, రాణి, వెన్నెల పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

తడ: భర్త మళ్లీ మద్యం తాగడంతో మనస్తాపానికి గురైన భార్య సుధ(48) బుధవారం ఉరి వేసుకుని మృతి చెందింది. ఎస్ఐ కొండపనాయుడు కథనం మేరకు.. రామాపురం పంచాయతీ ఎస్ఆర్ కండ్రిగకు చెందిన లారీ డ్రైవర్ కుమార్ మద్యానికి బానిసయ్యాడు. తరచూ కుటుంబంలో గొడవలు నెలకొనేవి. దీనిపై పెద్దలు పంచాయితీ చేయడంతో కుమార్ ఏడాదిన్నరగా మద్యం మానేశాడు. బుధవారం మళ్లీ మద్యం సేవించాడు. దీనిపై మనస్తాపం చెందిన సుధ రాత్రి మేకల దొడ్డిలో చీరతో ఉరి వేసుకుంది. గమనించిన భర్త, కుమారుడు ఆమెను చెన్నై స్టాన్లీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బాలల దినోత్సవం







గూడూరు రూరల్: గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం, దొరవారిసత్రం: కల్లూరు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న పీపీ, తడ: విద్యార్థి జయమిత్రను సన్మానిస్తున్న ఎంఈవో

చిల్లకూరు/గూడూరు రూరల్/దొరవారిసత్రం/పెళ్లకూరు/రాపూరు/కలువాయి/సూళ్లూరుపేట రూరల్/వెంకటగిరి(సైదాపురం)/నాయుడుపేట టౌన్/తడ: చాచా నెహ్రూ పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. భారత మొదటి ప్రధాని నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. పిల్లలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

- గూడూరు పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ ప్రభుత్వ పాఠశాలలో ప్రజాభ్యుదయ సేవా సమితి సభ్యులు బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. పాఠశాల హెచ్ఎం చెంచుక్రిష్ణయ్య, సంస్థ సభ్యులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి విజేతలకు రూ.35 వేలు విలువ చేసే బహుమతులు అందజేశారు. ఎంఈవో సనత్‌కుమార్, హెచ్ఎం భారతి, అసోసియేషన్ సభ్యులు, ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు, దేవానంద్, పీడీ శివకుమార్ పాల్గొన్నారు. గాంధీనగర్ సమీపంలోని మినీ గురుకులం విద్యార్థినులకు క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్, రోటరీ సభ్యులు వెంకటేశ్వరరెడ్డి, దశరథరామిరెడ్డి, ఎస్.వి.రత్నం ,రవికుమార్, జి.జి.నాయుడు, ప్రిన్సిపాల్ మేరీ ప్రియతి తదితరులు పాల్గొన్నారు.
- చిల్లకూరు మండలం చింతవరంలోని రేస్ స్కూల్ కరస్పాండెంట్ బాలచెన్నయ్య మన దేశ మొదటి ప్రధాని నెహ్రూ గురించి వివరించారు. చిన్నారులకు పోటీలు నిర్వహించి బహుమతులందజేశారు.
- దొరవారిసత్రం మండలం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సూళ్లూరుపేట కోర్టు పీపీ ప్రకృతికుమార్, ఎస్ఐ అజయ్‌కుమార్ సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాల వినియోగం, ర్యాగింగ్ తదితరాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. హెచ్ఎం రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- పెళ్లకూరు మండలం నెలబల్లి, పెళ్లకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, దిగువచావలి, కానూరు, తాళ్వాయిపాడు ప్రభుత్వ పాఠశాలల్లో నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేశారు. ఎంఈవో శంకరయ్య నెహ్రూ అవలంబించిన విదేశాంగ విధానం, పంచవర్ష ప్రణాళికల తదితరాలను విద్యార్థులకు వివరించారు.
- రాపూరు మండలం గోనుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో, రాపూరు ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయ సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవాన్ని జరుపుకున్నారు. గ్రంథాలయ అధికారిణి ధనమ్మ, ఉపాధ్యాయులు ప్రసాద్, యమున, వెంకటేశ్వర్లు, గౌస్‌మొహిద్దీన్, పరంధామయ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.
- కలువాయి మండలం తెలుగురాయపురం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం జీవీ మురళీకృష్ణ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు ఆర్‌వీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- సూళ్లూరుపేట మండలంలోని అటకానితిప్ప ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పట్టణంలో ఉన్న ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యా సామగ్రి అందజేశారు. పాఠశాల చైర్ పర్సన్ కుయిల్, శ్రీహరికోట ఎచ్ఎం రేవతి, సంస్థ సభ్యులు లలితమ్మ, ప్రసూనమ్మ పాల్గొన్నారు.
- వెంకటగిరి పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి అనూష విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. న్యాయవాదిరాజారావు, సాయినాథ్, ప్రిన్సిపాల్ తులసిజ్యోతి పాల్గొన్నారు.
- నాయుడుపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంఈవో మునిరత్నం, సీడీపీవో ఉమామహేశ్వరి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- తడ మండలం రామాపురం ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్టోబర్ 25న చెన్నైలో జరిగిన ×కలాంస్ వరల్డ్ రికార్డు₹ కార్యక్రమంలో 2 నిమిషాల 40 సెకండ్లలో వంద మంది శాస్త్రవేత్తల పేర్లు, వారు కనిపెట్టిన ముఖ్య విషయాలను తెలియజేసి అవార్డు అందుకున్న విద్యార్థి జయమిత్రను సన్మానించారు. ఎంఈవో మల్లికార్జునరావు, హెచ్ఎం మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాపూరు: గోనుపల్లిలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హెచ్ఎం నాగేంద్రకుమార్



పెళ్లకూరు: దిగువచావలి, నెలబల్లి జెడ్పీహైస్కూల్లో నెహ్రూ జయంతి వేడుకలు

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు వేగవంతం చేయాలి

రాపూరు: మండలంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను వేగవంతం చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి ఖాదర్‌వలి అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం రాపూరు మండలం వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. వారంలో 45 గృహాల్లో సర్వే చేయాలని ఆదేశించారు. వైద్యాధికారిణి ప్రమీల రాజకుమారి, సిబ్బంది మమత, అబీద, మాధవి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఖాదర్‌వలి

క్యాన్సర్‌పై అవగాహన

కోట: స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి చికిత్స చేస్తే నయం అవుతుందని చిట్టేడు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ నాగరాజు తెలిపారు. వెంకన్నపాళెంలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్క్రీనింగ్ సర్వే చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణ, ఏఎన్ఎం నిరోషా పాల్గొన్నారు.

నిమ్మలో బొబ్బర తెగులుతో అప్రమత్తంగా ఉండాలి

వెంకటగిరి రూరల్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నిమ్మ పంటకు గజ్జి(బొబ్బర) తెగులు సోకే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ నిమ్మపంటలో బొబ్బర తెగులు సోకినట్లు అనుమానం వచ్చిన వెంటనే బోర్డో మిశ్రమాన్ని చెట్లపై పిచికారీ చేయాలన్నారు. బోర్డో మిశ్రమం తయారీ విధానాన్ని వివరించారు. 50 లీటర్ల నీటిలో కేజీ మెలుతుత్తం వేసి కరిగే వరకు కర్రతో తిప్పాలన్నారు. అందులో కేజీ సున్నం వేసి బాగా కలపాలన్నారు. ఆ నీటిని నిమ్మచెట్లపై పిచికారీ చేయాలని తెలిపారు. వివరాలకు 9440572070లో సంప్రదించాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు ఎంతో అవసరం

సైదాపురం : గ్రామ పంచాయతీ అభివృద్ధి కావాలంటే ప్రణాళికలు అవసరమని నెల్లూరు జెడ్పీ సీఈవో జే మోహన్‌రావు పేర్కొన్నారు. సైదాపురం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు సమన్వయంతో గ్రామ ప్రణాళికను తయారు చేసుకోవాలన్నారు. దాన్ని తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఆయన కోరారు. ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, వైస్ ఎంపీపీలు తిరకాల భాస్కర్, ఈశ్వరమ్మ, ఎంపీటీసీలు ఈశ్వరరాజు,నాగరాజు, పద్మ, సుమతి, శ్రీనివాసులు, సర్పంచులు శారద, రమాదేవి, శివయ్య, పెంచలయ్య ఏపీఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సైదాపురం: మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో

గ్రామ స్వరాజ్యం దిశగా ప్రణాళికలు

కలువాయి: గ్రామ స్వరాజ్యం దిశగా అధికారులు అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ఏపీ ఎస్ఐఆర్‌డీపీఆర్ ఏ.రమేష్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. గ్రామసభ, బాల సభ, మహిళా సభలు నిర్వహించి వారి సూచనలు, సలహాల మేరకు సమగ్ర ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు, ఈవోపీఆర్‌డీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట స్వర్ణముఖి నదిలో పడి మృతి చెందిన వ్యక్తి ఎల్ఏ సాగరం ప్రాంతానికి చెందిన బండి సుధాకర్(55)గా గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. స్వర్ణముఖి నది కాజ్‌వే సమీపంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహన్ని పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. మార్చురీలో ఉన్న మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గురువారం చూసి సుధాకర్‌గా గుర్తించారని పోలీసులు తెలిపారు. అతను ఆదివారం ఇంటి నుంచి వెళ్లాడని, మద్యం మత్తులో స్వర్ణముఖి నది వద్దకు వెళ్లి నీటి గుంతలో పడి మృతి చెంది ఉండవచ్చని వెల్లడించారు.

ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయండి

నాయుడుపేట టౌన్: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం ఉండేలా చూడాలని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మీ అధికారులను ఆదేశించారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ రాజేంద్ర, సీడీపీవో ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుండా భారం మోపుతున్నారు

చిల్లకూరు/నాయుడుపేట టౌన్: కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలపై భారం మోపడం శోచనీయమని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు గురువారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం, నాయుడుపేట రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఉచిత ఇసుక అని చెప్పి ఇసుక దొరకకుండా చేస్తూ భవన నిర్మాణ కార్మికుల పొట్టకొడుతున్నారని దుయ్యబట్టారు. విద్యుత్ చార్జీలతోపాటు నిత్యావసర వస్తువుల ధరలను అమాంతం పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని వాపోయారు. మహిళలు, యువతులు, బాలికలపై అత్యాచారాలు పెరిగాయని, వాటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఏవోతోపాటు నాయుడుపేట తహసీల్దార్ రాజేంద్రకు వినతి పత్రాలు సమర్పించారు.

వీవీవీఆర్‌కే యాచేంద్రకు ఘన నివాళి

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే వీవీవీఆర్‌కే యాచేంద్ర జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కైవల్యానది సమీపంలో ఉన్న వీవీవీఆర్‌కే యాచేంద్ర కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. ఎస్వీబీసీ మాజీ చైర్మన్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్ర మాట్లాడుతూ వెంకటగిరి అభివృద్ధికి వీవీవీఆర్‌కే యాచేంద్ర చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆర్‌వీఎం ఉన్నత పాఠశాలను స్థాపించి లక్షలాది మంది విద్యార్థులకు విద్య అందజేశారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, కౌన్సిలర్లు ఎంఏ నారాయణ, ఆరిశంకరయ్య, రాజా అభిమానులు పులి ప్రసాద్‌రెడ్డి, జలగం కామాక్షి, చింతపట్ల మురళీ, బీరం రాజేశ్వరరావు, మధునాయుడు, రమేష్‌రెడ్డి, పునుగోటి సుబ్రమణ్యం, నాగయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.



వీవీవీఆర్‌కే యాచేంద్రకు వీబీ సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞ కుమార యాచేంద్ర నివాళి

ప్రకృతి వ్యవసాయానికి మంచి భవిష్యత్

చిల్లకూరు: ప్రకృతి వ్యవసాయానికి మంచి భవిష్యత్ ఉందని గూడూరు ఏడీఏ గోపీనాయక్ తెలిపారు. గూడూరులోని ఏడీఏ కార్యాలయంలో గురువారం గూడూరు, చిల్లకూరు, కోట, ఓజిలి గ్రామాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించుకునే వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సర్టిఫికెట్లు పొందిన రైతులు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఎక్కడైనా విక్రయించుకోవచ్చని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి తక్కువగా ఉంటుందన్నారు. పేడ, ఆవు మూత్రం, పలు రకాల ఆకులతో తయారు చేసుకునే జీవామృతం వినియోగించడం ద్వారా చీడపీడల నుంచి పంటలను రక్షించుకోవచ్చన్నారు. టెక్నికల్ ఏవో చెంచురెడ్డి, ఎస్ఎఫ్ఏ మధు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

కోట: మండలంలోని శ్యామ్‌సుందరపురానికి చెందిన విద్యార్థి కె.కరుణకు శ్రీ షిరిడీ సాయి అక్షయ సేవా సమితి సభ్యులు ఆర్థిక సాయం అందించారు. ఆమె నెల్లూరులోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఫీజు చెల్లించే స్థోమత లేకపోవడంతో సేవా సమితిని ఆశ్రయించింది. ఈ క్రమంలో ఆమెకు గురువారం రూ.10 వేల సాయం అందించినట్టు అక్షయ సేవా సమితి కన్వీనర్ అల్లం రమణయ్య తెలిపారు.

ఆఖరి మజిలీకి తప్పని తిప్పలు

ప్రతి మనిషికీ చివరి మజిలీ శ్మశానవాటికే. అక్కడా కష్టాలు తప్పడం లేదు. సరైన వసతులు లేకపోవడంతో అంతిమయాత్ర సమయంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎవరైనా చనిపోతే మృతదేహాలను శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు రోడ్లు లేవు. పంట పొలాల గట్లు, కాలువలు, వంకల గుండా వెళ్లాల్సి వస్తోందని పెళ్లకూరు మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శ్మశానం దారిలేక అతి కష్టంమీద శవాన్ని తీసుకెళుతున్న దృశ్యం(ఫైల్)

పెళ్లకూరు: ప్రతి పంచాయతీలోనూ అన్ని సౌకర్యాలతో శ్మశానవాటికలు నిర్మించాలని గత ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా ఉపాధి హామీ కింద పనులు చేపట్టాలని ఆదేశించింది. నిధులను సైతం విడుదల చేసింది. ఇందులో భాగంగానే పెళ్లకూరు మండలంలోని 24 పంచాయతీల్లోనూ వసతుల కల్పనకు ఒక్కోదానికి రూ.10 లక్షల చొప్పున రూ.2.20 కోట్లు మంజూరు చేసింది. శిరసనంబేడు, అనకవోలు గ్రామాల్లో మాత్రమే పూర్తిస్థాయిలో పనులు పూర్తయ్యాయి. మిగిలినవన్నీ అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. వీటిలో తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, రోసనూరు, నందిమాల, అర్థమాల, చావలి, పాలచ్చూరు, కలవకూరు, ముమ్మారెడ్డిగుంట, చింతపూడి, రావులపాడు, పునబాక, జీలపాటూరు గ్రామాల్లో పనులు చేపట్టకపోవడం గమనార్హం. మండల కేంద్రమైన పెళ్లకూరులోని పాత దళితవాడ నుంచి శ్మశానానికి వెళ్లే దారి లేకపోవడంతో వ్యవసాయ పొలం గట్లపై అతి కష్టం మీద శవాలను తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే కానూరు అరుంధతి కాలనీకి సంబంధించిన శ్మశానవాటిక దారిని స్థానికేతరులు ఆక్రమించుకోవడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు. ఎగువచావలి, చెంబడిపాళెం గ్రామాలకు సంబంధించిన శ్మశానవాటిక రోడ్లను కొంతమంది స్థానికులు ఆక్రమించుకుని తమ వ్యవసాయ పొలాల్లో కలిపేసుకున్నారు. దీంతో మృతదేహాలను తీసుకెళ్లే దారిలేక తిప్పలు పడుతున్నారు. అలాగే అక్కగారిపేట, రావులపాడు, నందిమాల, కిష్టప్పకండ్రిగ, తాళ్వాయిపాడు, పెన్నేపల్లి, రోసనూరు, జీలపాటూరు తదితర గ్రామాల్లో కూడా శ్మశానవాటికలు లేకపోవడంతో ముళ్లచెట్లు మాటున దహన సంస్కారాలు కొనసాగిస్తున్నారు.

అంతిమయాత్రలో కష్టాలు తప్పడం లేదు



చాలాకాలంగా మా గ్రామానికి శ్మశానవాటిక లేదు. ఊరి చివర కొంత స్థలంలో శవాలను పూడ్చిపెడుతున్నాం. అక్కడికి వెళ్లడానికి కూడా రోడ్డు లేదు. శవాలను శ్మశానానికి తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. అధికారులు చర్యలు తీసుకోవాలి. –బీ చిరంజీవి, రోసనూరు

అధికారులు చర్యలు చేపట్టాలి



శ్మశానవాటికల నిర్మాణం కోసం గత ప్రభుత్వం నిధులు విడుదల చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. పనులను చేపట్టిన వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో శవాలను తీసుకెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులను వేగవంతంగా చేయాలి.

– తిరుపాలు, అర్ధమాల

పట్టించుకోని అధికారులు

శ్మశానవాటికల నిర్మాణ పనుల్లో జాప్యం, ఆక్రమణలకు గురైన శ్మశానవాటికల రోడ్ల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. కొన్నిచోట్ల అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల వల్లే శ్మశానవాటికల పనులు పూర్తికావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి శ్మశానవాటికలకు రోడ్లు, శ్మశానవాటికల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.